# ఆరగింపు!

"శ్రీమదఖిల మహీమండల మండన ధరణిధర మండలా ఖండలస్య, నిఖిల సురాసుర వందిత వరాహ క్షేత్ర విభూషణస్య...." శ్రీనివాస గద్య గోవిందా చార్యుల గొంతు మైక్‌లో వినిపించగానే భక్తులంతా ఆలయం వైపు పరుగులు తీస్తారు. హారతి కళ్ళకద్దుకుని తీర్ధ ప్రసాదాలు తీసుకునేందుకు.

ధనుర్మాసంలో భక్తుల తొక్కిడి మరీ ఎక్కువగా వుంటుంది. ఆలయ ధర్మకర్త జానకిరామయ్య గారు భక్తులకు ప్రసాదం పంపిణీ కార్యక్రమం స్వయంగా పర్యవేక్షిస్తారు. ధనుర్మాసంలో ప్రసాదాలు అందరికీ అందేలా చూస్తారు.

సుమారు రెండు వందల సంవత్సరాల క్రితం ఆ వేంకటేశ్వరస్వామి వారి ఆలయాన్ని జానకిరామయ్యగారి పూర్వీకులు కట్టించేరు. నిలువెత్తుగల వేంకటేశ్వర, పద్మావతీ విగ్రహాలు ప్రతిష్ఠ చేసి, నిత్యపూజలకూ, ధూపదీప నైవేద్యాలకూ, అర్చకులకు పనివారలకూ జీతభత్యాలకు ఏ లోటు రాకుండా నిధులు ఏర్పాటు చేసేరు. పర్వదినాలలో జరగబోయే ప్రత్యేక పూజలకూ, ఏటా జరగబోయే శ్రీనివాస కల్యాణానికి హుండీ కలెక్షన్ కూడ వినియోగిస్తున్నారు.

గర్భగుడి ముందు విశాలమైన మండపం, కల్యాణ మండపం, వంటగది, అర్చకుని నివాసగృహం, వగైరాలు తదుపరి ధర్మకర్తలు కట్టించేరు. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పూలమొక్కలు నాటించి వాటి రక్షణ కొరకు తోటపని వానిని నియమించేరు.

విగ్రహ ప్రతిష్ఠ జరిగిన నాటినుండీ వంశపారంపర్య అర్చకులు గోవిందాచార్యుల పూర్వీకులే. వారు ఆలయ ధర్మకర్తలకు గురువులు, గోవిందా చార్యులది శ్రావ్యమైన



గొంతు. అతను పూజ చేస్తున్నా, సుప్రభాతం చదువుతున్నా, శ్రీనివాస గద్య వినిపిస్తున్నా శ్రోతలు పరవశం చెందుతారు.

గోవిందాచార్యులు గొప్పలౌక్యుడు. అతని లౌక్యం ప్రసాదాల పంపిణీలో కనిపిస్తుంది. హారతి పళ్ళెంలో భక్తులు వేసే దక్షిణలను బట్టి వుంటుంది. దక్షిణ ఎక్కువగా వేసేవారికి చక్రపొంగలి, పులిహోర వ^'ి ప్రసాదాలు, మిగిలిన వారికి పంచదార పలుకులు అందుతాయి. నిత్యం అతనికి హారతి పళ్ళెంలో దక్షిణ రెండువందల రూపాయలకు తగ్గదు. శుక్ర,శనివారాల్లోనూ, పర్వదినాల్లోనూ రాబడి నాలుగైదు రెట్లుంటుంది. అందువల్ల గోవిందాచార్యులు ఎన్ని యిబ్బందులు వచ్చినా, అర్చకత్వం డ్యూటీకి నాగా పెట్టడు. తెలివిగా సమయస్ఫూర్తితో నెట్టుకొస్తున్నాడు.

అయితే యీ యేడు అనుకోని విధంగా గోవిందాచార్యులకు ధనుర్మాసంలో ఆటంకం వచ్చింది. అతను పదకొండు దినాలు గర్భగుడిలో అర్చనాకార్యక్రమాలు నిర్వహించడానికి వీల్లేదు.

"మంచి రాబడి సమయంలో ఆటంకం వచ్చింది." అని ఎంతో చింతించేడు.

తాత్కాలికంగా పదకొండు దినాలూ ఎవరినైనా అర్చకునిగా నియమిస్తే అతనికి రోజుకి వందరూపాయల జీతం, హారతి పళ్ళెంలో వచ్చే దక్షిణలో సగభాగం, రో జుకి రెండు పావుల కట్టడుల భత్యం వగైరాలు యిచ్చుకోవాలి! అంటే సుమారు మూడు వేల వరకూ ఖర్చు!

"గోవిందాచార్యులు ఎన్నో విధాలుగా ఆలోచించి చివరకు గర్భగుడిలో పూజలకు తన మేనల్లుడు శ్రీనివాసాచారిని పెట్టాలి!" అనుకొని ఆ విషయం జానకిరామయ్య దంపతుల చెవిన వేసేడు.

"నేను మండపంలో మైక్ ముందు కూర్చుని మంత్రాలు చదువుతాను! గర్భగుడిలో పెరుమాళ్ళ పూజాకార్యక్రమం క్రియలు నా మేనల్లుడు శ్రీనివాసాచారి జరుపుతాడు" అని చెప్పేడు.

శ్రీనివాసాచారి వయస్సు 12 సంవత్సరాలు. మనిషి బొద్దుగా వుంటాడు. కాన్వెంట్‌లో సెవెన్త్‌క్లాస్ చదువుతున్నాడు. గత ఏడాదే వాడికి ఉపనయనం చేసి శంఖు, చక్రాలు వేయించిన సంగతి ధర్మకర్తకు తెలుసు. అందువల్ల జానకిరామయ్య గారు అభ్యంతరం చెప్పలేదు.

గోవిందాచార్యులు ఎంతో సంతోషించి వెంటనే శ్రీనివాసాచారిని రప్పించి వాడికి పెరుమాళ్ళ పూజా కార్యక్రమ విధులు చెప్పేరు. ముఖ్యంగా భక్తులకు తీర్థం యిచ్చేటప్పుడూ, శఠగోపం తలపై తాకించేటప్పుడూ చెప్పవలసిన మంత్రం వాడిచేత వల్లెవేయించేడు. శ్రీనివాసాచారి మంచి చురుకైన వాడు. మేనమామ చెప్పిన విషయాలు గుర్తుంచుకున్నాడు.

మర్నాడుదయాన్నే శ్రీనివాసాచారి స్నానాదులు ముగించుకుని పట్టుపంచె కట్టుకున్నాడు. నుదుట మూడు నామాలూ దిద్దుకున్నాడు. గోవిందాచార్యులు వాడి చేత గుళ్ళో పెరుమాళ్ల నిర్మాల్యం విసర్జింపచేసి పుష్పమాలలతో అలంకరింపజేసేడు. తను మండపంలో మైక్ ముందు కూర్చొని నిదానంగా మంత్రాలు చదువుతూ పూజాకార్యక్రమం జరుపుతున్నాడు.

ఆసరికి వంటవాడు ప్రసాదాలు చక్రపొంగలి, పులిహోర, దద్ధోజనం తెచ్చి గర్భగుడిలో వుంచేడు.

గర్భాలయం గుమ్మం ముందు తెరవేయమని చెప్పి, ప్రసాదాలలో కొంత

భాగం తీసి వేరే వెండి పళ్ళేలలో వుంచి సంప్రోక్షణ చేసి వాటిని ఆరగింపు చేయ మన్నాడు.

గోవిందాచార్యులు జేగంట మ్రోగించటం మొదలుపెట్టాడు.

ధర్మకర్త జానకిరామయ్యగారు కుటుంబ సమేతంగా వచ్చి మండపంలో కూర్చున్నారు. ఊర్లోపెద్దలూ, భక్తులూ చాలమంది వచ్చేరు.

"ఆరగింపు అవుతున్నది! అవగానే తెరతీసి హారతిచ్చి తీర్థప్రసాదాలు యిస్తాడు. పిల్లాడికి క్రొత్త! అందువల్ల పూజా కార్యక్రమం కాస్త నిదానంగా నెమ్మదిగా జరుగుతోంది. రేపటినుంచి అలవాటై తొందరగానే చేస్తాడు!" అన్నాడు వినయంగా గోవిందాచార్యులు జేగంట మోత ఆపి.

"మాకు తొందరేమీలేదు! పూజ నిదానంగానే జరగనీయండి!" అన్నారు జానకిరామయ్యగారు చిరునవ్వుతో.

"చిత్తం! చిత్తం!" అని రెండు నిముషాలు మరలా జేగంట మ్రోగించి.

"ఆరగింపు అయిందిరా! శ్రీనివాసా!" అన్నాడు.

"చక్రపొంగలి, వులిహోరా ఆరగింపయింది మామయ్యా! దద్ధోజనమే మిగిలింది!' అన్నాడు శ్రీనివాసాచారి గర్భగుడిలోంచి

"ఎంతసేపురా! త్వరగా కానీ! ధర్మకర్తగారు..."

"ఎలా కానిచ్చేది మామయ్యా! యింక నా పొట్టలో ప్లేస్ లేదు! కడుపు నిండి పోయింది! దోద్దజనం మరి ఆరగింపు చెయ్యలేను!" అన్న శ్రీనివాసాచారి మాటలకు అంతా నిర్ఘాంతపోయేరు!

('మహతి', అక్టోబర్-డిసెంబర్ 2000) ✪